నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

- ముస్తాబైన ఆలయాలు
- ప్రత్యేక అలంకారాలు, పూజలు ఏర్పాటు


రవ్వవరం జగన్మాతపీఠంలో దుర్గాదేవి మూలవిరాట్


శాంతినగర్‌లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నరసరావుపేట ఈస్ట్: శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ఆయా ఆలయాలలోని అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించనున్నారు. పాతూరులో దేవాదాయశాఖ పరిధిలోని గంగా పార్వతీ సమేత భీమ లింగేశ్వరస్వామి ఆలయం, సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, పాతూరు చెరువుకట్ట వీధిలోని శ్రీచౌడేశ్వరీ ఆలయం, విజయ చాముండేశ్వరి ఆలయం, బరంపేటలోని శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు, రావిపాడురోడ్డులోని శ్రీపార్వతీ సమేత కళ్యాణసుందరేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవార్లు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 15వ తేదీన బాలా, 16న మహేశ్వరి, 17న కౌమారి, 18న గాయత్రి, 19న లక్ష్మీదేవి, 20న సరస్వతి, 21న అన్నపూర్ణ, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దిని, 24న శ్రీరాజరాజేశ్వరీ అలంకారాలతో భక్తులను అనుగ్రహించనున్నారు.

శంకరమఠంలో..

శ్రీశృంగేరి శంకరమఠంలో వేంచేసియున్న శారదాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు శనివారం నుంచి ఆరంభమయ్యాయి. అలాగే 20వతేదీ శుక్రవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 9.30 గంటల వరకు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. 9 రోజుల పాటూ నవరాత్రులు నిర్వహించనున్నారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో మొదటి ఏడాది వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజు బాలత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న లలిత త్రిపుర సుందరీదేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్దిని, 23న రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 24న ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

రవ్వవరం జగన్మాతపీఠంలో

వినుకొండ(నూజెండ్ల): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినుకొండ విఠంరాజుపల్లి సమీపంలోని సాయిబృందావనం వద్ద శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో హిమాలయ బాబా పర్యవేక్షణలో పది రోజుల పాటు ఉత్సావాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సుమారు కోటి రూపాయల ఖర్చుతో అమ్మవారి వివిధ రూపాలను కలకత్తా నుంచి కళాకారులతో ప్రత్యేకంగా తయారు చేయించారు.

దసరా మామూళ్లు రద్దు చేశాం

నరసరావుపేట: పట్టణంలో వ్యాపారస్తులను ఎవరూ దసరా మామూళ్లు అడగవద్దని, వాటిని రద్దుచేయటం జరిగిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు వెల్లడించారు. శనివారం చాంబర్ ఆధ్వర్యంలో రద్దుచేసిన పత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి రామకృష్ణ, కోశాధికారి జగన్నాధరావు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు

శావల్యాపురం: రబీ సీజను ప్రారంభమైన నేపథ్యంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో శనగ విత్తనాలను ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. శనగ విత్తనాలు కొరత లేదని ఆయన వివరించారు.

ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలి

చిలకలూరిపేట: ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలని రోటరీక్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్ష,కార్యదర్శులు కాపు వెంకటరావు, ఆళ్ల వేమనరెడ్డి చెప్పారు. మండలంలోని మురికిపూడి జెడ్పీహైస్కూల్‌లో శనివారం క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చైనాలో జరగనున్న రోలర్ స్కేటింగ్ ఏషియన్ ట్రోఫీకి ఎంపికైన మురికిపూడి గ్రామానికి చెందిన విద్యార్థి తేజస్‌కు రూ. 25వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

నరసరావుపేట రూరల్: నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవడం ద్వారా విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని జేఎన్‌టీయుఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను పురస్కరించుకుని నేషనల్ ఇన్నోవేషన్ డే, ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు.

ఎండిపోతున్న పంటలు కాపాడాలి

నరసరావుపేట: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, వాటిని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ఏపీ రైతు, కౌలురైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సాగర్‌లో డెడ్‌స్టోరేజ్‌లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తోడి పంటలకు నీటిని అందించాలని కోరారు. శనివారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడారు.

డీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి అలెగ్జాండర్

నరసరావుపేట: రెండవసారి పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పలువురు నాయకులు పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ అజెండా

- ప్రజల అవసరాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ పరిపాలన
- వినుకొండ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- టీడీపీ హయాంలో వినుకొండ అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్నివిధాలా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. వినుకొండలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణంతో పాటు త్వరలోనే రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారంతో పాటు మున్సిపల్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్‌లు, కోల్డ్ స్టోరేజీలు, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గుండ్లకమ్మ నదిపై వంతెనలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. వినుకొండ నియోజకవర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే నియోజకవర్గానికి పేరు తీసుకొస్తామన్నారు. రీసర్వేలో భాగంగా నియోజకవర్గంలో 75 శాతం పనులు పూర్తయ్యా యని, అప్పాపురం, తిమ్మాపురం, కొండ్రప్రోలు, గుమ్మనంపాడు, అంగలూరు, నాగులవరం, శివాపురం అగ్రహారం భూములు కూడా సర్వే చేయించి త్వరలోనే హక్కులు కల్పించనున్నట్లు చెప్పారు. నిజాయితీగా, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం....

తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజలకు చెప్పుకోదగిన ఒక్క పనికూడా నియోజకవర్గంలో జరగలేదని విమర్శించారు. రైతులపై టీడీపీకి మాట్లాడే హక్కు లేదని, 14 ఏళ్ల చంద్రబాబు పరిపాలనలో రైతులు ఏ రోజు సంతోషంగా లేరని అన్నారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప వినుకొండ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ఈపూరు: దసరా సెలవుల్లో భాగంగా విద్యార్థుల కోసం ఈపూరు శాఖ గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు తెలిపారు. కథలు చెప్పడం, వినడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్‌లలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో నూర్‌బాషా,దూదెకుల ముస్లింలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరుతూ ఛలో గుంటూరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లవాల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించినట్లు దూదెకుల సంఘం రాష్ట్ర మీడియా కన్వీనర్ దర్శవరపు నాగూర్‌వలీ శనివారం తెలిపారు. అనంతరం కారుమంచి నూర్‌బాషా సంఘం అధ్యక్షులు కొచ్చర్ల కమాల్సు, ప్రధానకార్యదర్శి ధర్మవరపు అంజయ్య, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాతకోట నాగూర్‌వలి,దరియాపాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యడ్లపాడు: చీడపీడల నివారణకు పురుగుల మందు చల్లే క్రమంలో గాలివాటుకు నోటిలోకి వెళ్లి వ్యవసాయ కూలీ అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 9న మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన ఉయ్యాల వెంకటరమణ (25) అదే గ్రామానికి చెందిన ఘంటా శ్రీను అనే రైతు పొలంలో పురుగుల మందు చల్లేందుకు కూలికి వెళ్లాడు. పంటచేలో మొక్కలపై పురుగుమందు పిచికారీ చేస్తున్న క్రమంలో ఎదురుగాలి వీయడంతో సదరు మందు అతని నోటిలోకి వెళ్లింది. దీంతో అస్వస్థతకు గురైన వెంకట రమణను గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): బొల్లాపల్లి మండలంలోని సీతారామపురం తండాలో చెడువ్యసనాలకు బానిసై తండ్రిని చంపిన నిందితుడు వడితే సత్తా నాయక్‌ను వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు, బొల్లాపల్లి ఎస్ఐ గల్లా రవికృష్ణ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి వివరాలు వెల్లడించారు. సీతారామపురం తండాకు చెందిన వడితే హరిసింగ్ నాయక్ కుమారుడైన సత్తానాయక్ చెడు వ్యసనాలకు బానిసై తండ్రి పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినప్పటికీ పద్ధతి మార్చుకోకుండా తండ్రిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 11వ తేదీన తండ్రి హరిసింగ్ నాయక్ మంచంపై పడుకొని ఉండగా నిందితుడు పథకం ప్రకారం పచ్చడి నూరే రోకలి బండతో తండ్రి తలపై కొట్టాడు. ఈ ఘటనలో తండ్రి మృతిచెందాడు. మృతుని భార్య హునీబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడిని వెల్లటూరు సమీపంలో అరెస్ట్ చేసి మీడియా ముందు హాజరుపరిచారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No: 74/2021 O.S.No: 280/1016

Between:
గట్టా పూర్ణచంద్రరావు -డి.హెచ్.ఆర్
Vs
1) బూరుగుపల్లి రామకృష్ణ
2) తోట వెంకటరత్నం నాయుడు - జె.డి.ఆర్.

[illegible] శ్రీ కోర్టువారు 06-11-2023న ఉ॥ గం॥ 10-00 [illegible] 06-11-2023న శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొనవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలోని 1వ వార్డులోని, పురుషోత్తపట్నం గ్రామ డి.నెం.189/1, చిలకలూరిపేట మునిసిపల్ డోర్ నెం. 1-549/4 [illegible]

డి.హెచ్.ఆర్. విలువ: రూ. 10,00,000/-
అమీనా విలువ : రూ. 11,00,000/-
వేలం వాయిదా : 06-11-2023
ఫర్దర్ హియరింగ్: 14-11-2023
(కోర్టు ఉత్తర్వుల మేరకు)

మానుకొండ వీరేంద్రరావు, చంద్ర రాజేశ్వరరావు
అడ్వకేట్స్ ఫర్ డి.హెచ్.ఆర్, నరసరావుపేట.

